
సాక్షి బాపట్ల

శనివారం । 11 । అక్టోబర్ । 2025



మానసిక ఆరోగ్యం కీలకం

నకరికల్లు:అంతర్జాతీయ మానసిక ఆరోగ్య వారోత్సవాలను కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. మానసిక ఆరోగ్య కౌన్సిలర్ శాంతివర్ధన్ మాట్లాడారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 79,040 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 74,040 క్యూసెక్కులు వదులుతున్నారు.



ఇర్లపాడులో డీఎల్‌పీవో పర్యటన

నాదెండ్ల: ఇర్లపాడు గ్రామంలో శుక్రవారం నరసరావుపేట డీఎల్‌పీవో వీవీఎం లక్ష్మణరావు పర్యటించారు. చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణపై అభిప్రాయాలు తెలుసుకున్నారు.

న్యూస్‌రీల్

నేడు మిస్ ఇండియా అమూల్య ప్రియదర్శినికి సన్మానం



సత్తెనపల్లి: పట్టణానికి చెందిన అమూల్య ప్రియదర్శిని మిస్ ఇండియాగా మూడో స్థానం కైవసం చేసుకుని తొలిసారి శనివారం సత్తెనపల్లి రానున్నారు. ఇటీవల గోవాలో జరిగిన అందాల పోటీల్లో ఆమె తెలంగాణ నుంచి పాల్గొని మూడో స్థానంలో నిలిచింది. ప్రపంచ మిస్ యూనివర్స్ పోటీల్లో భారతదేశం నుంచి ఆమె పాల్గొన్నారు. గతంలో మిస్ హైదరాబాద్ కైవసం చేసుకున్నారు. ఆమె తాతయ్య చిలుకా రమేష్ సత్తెనపల్లి సహాయ కార్మిక శాఖ అధికారిగా గతంలో పని చేశారు. ఆమె రాకను పురస్కరించుకుని పార్క్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్తెనపల్లిలోని హోటల్ కార్తికేయ ఫంక్షన్ హాలులో సాయంత్రం 4 గంటలకు సన్మానం చేయనున్నట్లు బాధ్యులు, న్యాయవాది చలువాది చినసత్యనారాయణ, మిత్ర బృందం తెలిపింది.

జిల్లాకు 1970 మెట్రిక్ టన్నుల యూరియా



నాదెండ్ల: సాతులూరులోని రైల్వే ఎరువుల రేక్ పాయింట్‌ను శుక్రవారం పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు పరిశీలించారు. జిల్లాకు ఎస్‌ఎఫ్‌ఎల్ యూరియా 1970 మెట్రిక్ టన్నులు వచ్చినట్టు తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరమైనంత మేర యూరియా అందుబాటులో ఉందన్నారు. రేక్ పాయింట్ నుంచి సొసైటీలు, డీలర్లకు దామాషా ప్రకారం యూరియా పంపిణీ చేయాలని ఏవోలను ఆదేశించారు. ఆయన వెంట ఏడీఈ కేవీ శ్రీనివాసరావు, ఏవో శ్రీలత ఉన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలి



తాడేపల్లి రూరల్ : కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి డిమాండ్ చేశారు. శుక్రవారం వడ్డేశ్వరంలోని కార్యాలయంలో ఐద్వా రాష్ట్ర 16వ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 13, 14, 15 తేదీల్లో అనంతపురంలో జరగనున్న ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో డి. శ్రీనివాసకుమారి, కె.శ్రీదేవి, అమలశ్రీ తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి కోళ్లూరు ప్రసన్నాంజనేయుని దీక్షలు



బెల్లంకొండ: బెల్లంకొండ క్రాస్ రోడ్ వద్ద ఉన్న కోళ్లూరు ప్రసన్నాంజనేయస్వామి మాల ధారణ కార్యక్రమాలు ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు బొర్రా నరసింహాచార్యులు, అనంతాచార్యులు తెలిపారు. కార్తిక మాసంతో పాటు హనుమత్ వ్రత కార్యక్రమం సందర్భంగా మండల కాల దీక్షలు 23 వరకు ఉంటాయన్నారు. అర్ధ మండల కాల దీక్షలకు నవంబర్ 9 నుంచి 11 వరకు మాలధారణ జరుగుతుందని పేర్కొన్నారు. డిసెంబర్ 3న ప్రసన్నాంజనేయుని హనుమత్ వ్రత మహోత్సవ వేడుకలు జరుగుతాయని తెలిపారు.

ఈ-వేస్ట్ సేకరణ



సత్తెనపల్లి: ఈ-వేస్ట్ (ఎలక్ట్రానిక్) ను మున్సిపల్ వాహనాలకు అందించాలని మున్సిపల్ కమిషనర్ నంబూరి ఆనందకుమార్ శుక్రవారం తెలిపారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గృహాల్లో పాడైన బ్యాటరీలు, టీవీలు, వాషింగ్ మిషన్లు, ఫ్రిజ్‌లు, రైస్ కుక్కర్లు, మొబైల్ ఫోన్లు, మిక్సీలు, బల్బులు, ఎలక్ట్రానిక్ షాపుల్లో పాడైన కంప్యూటర్లు, ప్రింటర్లు, కీబోర్డులు, తదితర ఈ-వేస్ట్‌ను పురపాలక సంఘంలోని ప్రత్యేక కౌంటర్ నందు సేకరిస్తున్నట్లు తెలిపారు.

ఆశ నిరాశేనా ?

- గడువు తీరింది.. కల చెదిరింది!
- బాలికా సంరక్షణ పథకంపై ప్రభుత్వం నిర్లక్ష్యం
- మంజూరు కాని నిధులు
- కాలపరిమితి తీరిన బాండ్లు
- జిల్లావ్యాప్తంగా 25 వేల మంది ఎదురుచూపులు



వేటపాలెం: బాలికా సంరక్షణ పథకానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. చంద్రబాబు హయాంలోనే ప్రారంభించిన పథకం గురించి పట్టించుకోవడం లేదు. గడువు తీరిన బాండ్లకు నిధులు మంజూరులో జాప్యాన్ని నిరసిస్తూ తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2000లో అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ప్రవేశపెట్టిన బాలికా సంరక్షణ పథకానికి 2005లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర్‌రెడ్డి మార్పులు చేసి, అమలు చేశారు. తల్లిదండ్రులకు బీమా ఆధారిత బాండ్లను అప్పట్లో జారీ చేశారు. వాటి గడువు ముగియడంతో ఐసీడీఎస్ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. గడువు తీరిన బాండ్లకు నిధులు విడుదల చేయాలని కోరుతూ ఇప్పటి వరకు 1,192 మంది దరఖాస్తు చేసుకొన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేసిన వెంటనే సమాచారం ఇస్తామంటూ ఐసీడీఎస్ అధికారులు చెప్పి పంపిస్తున్నారు. దీంతో తల్లిదండ్రుల్లో అయోమయం నెలకొంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు కావస్తున్నా ఈ పథకం గురించి ఊసేలేదు. గడువు ముగిసిన బాండ్లకు నిధులు మంజూరు చేయడంలో జాప్యం చేయడాన్ని తల్లిదండ్రులు తప్పుపడుతున్నారు.

పథకం లబ్ధి ఇలా..

బాలికా సంరక్షణ పథకం కింద బాలిక ఒక్కరైతే రూ.లక్ష, ఇద్దరైతే రూ.60 వేలు చొప్పున తల్లిదండ్రులకు అందజేస్తారు. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉపకార వేతనం రూ.12 వేలు ఇస్తారు. సహజ మరణం కింద రూ.30 వేలు, ప్రమాదవశాత్తు గాయపడినా, మరణించినా రూ.75 వేలు, పాక్షిక అంగవైకల్యానికి రూ.37,500 చొప్పున అందజేస్తామని లబ్ధిదారులకు జారీ చేసిన బాండ్లల్లో పేర్కొన్నారు. అప్పట్లో హైదరాబాద్‌లోని ఎల్‌ఐసీ పీ అండ్ జీఎస్ సంస్థ ద్వారా వాటిని జారీ చేయించారు.



వేటపాలెం ఐసీడీఎస్ కార్యాలయం

జిల్లాలో 25 వేల మంది లబ్ధిదారులు



గడువు తీరిన బాండు

అప్పట్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో దాదాపు 25 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ నుంచి ఎల్‌ఐసీ బాండ్లు అందుకున్నారు. వీటి కాలపరిమితి కూడా ముగిసింది. పథకం కింద నగదు మంజూరు చేయాలని కోరుతూ జిల్లావ్యాప్తంగా 1192 మంది దరఖాస్తులు చేసుకొన్నారు. వీరిలో పలువురు రెండేళ్ల నుంచి ఐసీడీఎస్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రస్తుతం కాల పరిమితి ముగిసిన లబ్ధిదారుల నుంచి అధికారులు దరఖాస్తులు కూడా తీసుకోవడం లేదు. ముందు ఇచ్చిన బాండ్లకు ఇంత వరకు నగదు అందలేదు. కాల పరిమితి ముగిసిన వారు వందల సంఖ్యలో ఉన్నారు. తమకు నగదు ఇవ్వాలని పలువురు దరఖాస్తులు చేసుకోవడానికి ఇంకా సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కలుగజేసుకొని న్యాయం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం



బాలికా సంరక్షణ పథకం కింద గడువు తీరిన బాండ్లను అందజేస్తే పీడీ కార్యాలయానికి పంపుతాం. గతంలో గడువు తీరిన బాండ్లను ఇప్పటికే పంపాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే లబ్ధిదారులకు అందజేస్తాం.

– ఝాన్సీ, సీడీపీఓ, వేటపాలెం

బాణసంచా తయారీ దుకాణాలపై నిఘా

- నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్
- అనుమతులు లేని దుకాణాలను సీజ్ చేయాలి
- కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

బాపట్ల టౌన్: బాణసంచా తయారీ దుకాణాలపై నిత్యం నిఘా ఉండాలని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీగా బి. ఉమామహేశ్వర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా నిర్వహించిన సమావేశం కావడంతో జిల్లాలోని అన్ని అంశాలపై ఆయా అధికారులను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. తొలుత ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలు, పరిష్కరించేందుకు తీసుకున్న చర్యలు, విచారణ దశలో ఉన్న కేసుల పురోగతి, మహిళల మిస్సింగ్, గంజాయి, ఎస్సీ ఎస్టీ సంబంధిత కేసుల దర్యాప్తు, సైబర్ నేరాలు, శక్తి యాప్, మహిళ సంబంధిత చట్టాలపై సర్కిల్ వారీగా రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాణసంచా తయారీ, నిలువ చేసే కేంద్రాలు, విక్రయ దుకాణాలకు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు ఉండాలని స్పష్టం చేశారు. జిల్లా పోలీస్ అధికారులు వాటిని తరచూ తనిఖీ చేస్తూ ఉండాలని ఆదేశించారు. జాగ్రత్తలు తీసుకోని వారిపై, నిబంధనలను అతిక్రమించే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇళ్లలో నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసిన మందుగుండు సామగ్రిని సీజ్ చేయాలని తెలిపారు.

పాత నేరస్తులపై నిఘా ఉంచాలి

గతంలో నేరాలకు పాల్పడిన వారిపై నిరంతరం నిఘా ఉంచాలని, వారి కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఎస్పీ సూచించారు. పాత నేరస్తులు, రౌడీషీటర్లు, చెడు నడత కలిగిన వ్యక్తుల వివరాలు సంబంధిత స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు పూర్తిగా తెలిసి ఉండాలని చెప్పారు. నేరస్తుల పూర్తి సమాచారం ఉన్నప్పుడే నేరాలను సమర్థంగా కట్టడి చేయగలమని తెలిపారు. సోషల్ మీడియాపై నిఘా ఉంచాలన్నారు. ప్రజలు, రాజకీయ పార్టీలను రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టిన వారిపై, ఇతరుల మనోభావాలకు భంగం కలిగే విధంగా వార్తలు వ్యాపింపచేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గృహాలు, వ్యాపార సముదాయాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా యజమానులను ప్రోత్సహించాలని తెలిపారు. నిర్మానుష్య ప్రదేశాలు, బహిరంగ ప్రదేశాల్లో, నిరుపయోగంగా ఉన్న భవనాలు, అసాంఘిక కార్యకలాపాలు జరగడానికి అవకాశం ఉన్న ప్రదేశాలలో డ్రోన్‌లను ఎగురవేసి క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. దొంగతనాలు అరికట్టేందుకు నైట్ బీట్, పెట్రోలింగ్ పటిష్టంగా నిర్వహించాలని, స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కూడా తప్పనిసరిగా రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. సమావేశంలో రేపల్లె, బాపట్ల, చీరాల డీఎస్పీలు ఏ.శ్రీనివాసరావు, జి.రామాంజనేయులు, ఎండీ మోయిన్, సీసీఎస్ డీఎస్పీ పి. జగదీష్ నాయక్, డీసీఆర్బీ డీఎస్పీ బాలమురళీ కృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

పసిప్రాణాలంటే ఎంత అలుసో..!

చంద్రబాబు సర్కారు నిర్లక్ష్యంతో ఆసుపత్రి పాలైన హాస్టల్ విద్యార్థులు



కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

- అస్వస్థతకు గురైన 54 మంది అన్నవర్రు బీసీ హాస్టల్ విద్యార్థులు
- బాధితులను ఆస్పత్రికి తరలించిన కుక్, ఉపాధ్యాయులు
- కలెక్టర్ ఆదేశాలతో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు
- హాస్టల్‌లో ఆహారం, తాగునీటి నమూనాలు సేకరించిన అధికారులు

ప్రత్తిపాడు: పెదనందిపాడు మండలం అన్నవర్రులోని బీసీ హాస్టల్‌లో నాలుగు నుంచి పది తరగతుల వరకు మొత్తం 107 మంది విద్యార్థులున్నారు. వీరికి గురువారం రాత్రి బెండకాయ వేపుడు, రసం, మజ్జిగతో భోజనం పెట్టారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఒకరి తరువాత ఒకరు వాంతులు, విరేచనాలు, కడుపునొప్పితో బాధపడుతున్నారు. గమనించిన నైట్ వాచ్‌మన్ విషయాన్ని ఉదయం విధులకు వచ్చిన కుక్ కల్పనకు చెప్పారు. అప్పటికే 17 మంది అస్వస్థతకు గురై బాధపడుతుండటంతో కల్పన వారిని ఆటోలో పెదనందిపాడు పీహెచ్‌సీకి తరలించారు. ఉదయం కిచిడీ, టమాట చట్నీతో టిఫిన్ చేసిన తరువాత అదేవిధంగా బాధపడుతున్న మరో 37 మంది విద్యార్థులను కూడా ఆస్పత్రికి తరలించారు. వారిలో 16 మందిని మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు 108 వాహనాల్లో పంపించారు. సాయంత్రానికి 21 మందిని డిశ్చార్జ్ చేసి హాస్టల్‌కు తరలించగా, 17 మంది శిబిరంలో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా పెదనందిపాడు పీహెచ్‌సీకి చేరుకుని బాధిత విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి హాస్టల్‌ను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

ఆస్పత్రిలో సరిపోని బెడ్లు

ఒక్కసారే సుమారు యాభై మంది విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రికి రావడంతో ఆస్పత్రిలో ఉన్న బెడ్లు సరిపోలేదు. దీంతో ఒక్కో మంచంపై ఇద్దరు, ముగ్గురు, నలుగురిని కూడా పడుకోబెట్టి చికిత్స అందించారు. మంచం చుట్టూ సెలైను స్టాండ్లు పెట్టడంతో చేతులు అటూ ఇటూ కదపలేక, కడుపునొప్పి తాళలేక విద్యార్థులు నరకయాతన అనుభవించారు. అనంతరం వారి ఇబ్బందులను గమనించిన కలెక్టర్.. కల్యాణమండపంలో స్పెషల్ క్యాంప్ ఏర్పాటు చేయించారు. సెలైన్ స్టాండ్లు కూడా సరిపడినన్ని లేకపోవడంతో విద్యార్థులే ఒక చేతితో సెలైన్ బాటిల్ పట్టుకుని కనిపించగా, మరికొందరికి ఆశా కార్యకర్తలు బాటిళ్లు పట్టుకోవాల్సి వచ్చింది.

తీవ్ర జ్వరంతో బాధపడుతూ..

అస్వస్థతకు గురైన విద్యార్థుల్లో పదహారు మందిని మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. జ్వరం కూడా ఉన్నట్లు వైద్యులు గమనించారు. విద్యార్థులు ఇంత పెద్ద సంఖ్యలో అస్వస్థతకు గురవ్వడానికి స్పష్టమైన కారణాలు తెలియడం లేదు. దీంతో ఆయా శాఖల అధికారులు ఆహార పదార్థాల, తాగునీటి నమూనాలను సేకరించారు. ఇదిలా ఉంటే బుధవారం రాత్రి కూడా బయటి నుంచి బిర్యానీ, కలియా, పెరుగు చట్నీలు వచ్చాయి. వాటిని విద్యార్థులకు అందించారు. మరుసటి రోజు నుంచి కడుపునొప్పితో బాధపడినట్లు కొందరు విద్యార్థులు చెప్పారు.

మంత్రి దుర్గేష్ ఆరా

గుంటూరు మెడికల్: హాస్టల్‌లో విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ ఆరా తీశారు. వారు అస్వస్థతకు గురవ్వడం బాధాకరమని పేర్కొన్నారు.

వార్డెన్ నిర్లక్ష్యం..

గురువారం రాత్రి విద్యార్థులు భోజనం చేసే సమయంలోగానీ, ఉదయం విద్యార్థులు అస్వస్థతకు గురైనప్పుడుగానీ, వారిని ఆస్పత్రికి తరలించే సమయంలోగానీ వార్డెన్ అందుబాటులో లేకపోవడం ఆయన విధుల పట్ల వహిస్తున్న నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. కుక్‌కు సమీప బంధువు అయిన అశోక్ గత కొద్ది నెలలుగా హాస్టల్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇతనికి జీతం కూడా వార్డెన్ తన జేబు నుంచే చెల్లిస్తున్నట్లు చెబుతున్నారు. అశోక్ గురువారం రాత్రి వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. నీరు మాత్రమే తాగాడని సిబ్బంది చెబుతున్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, కలెక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల: బాల్య వివాహ రహిత బాపట్ల జిల్లా దిశగా కలిసికట్టుగా పని చేద్దామని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్, బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్‌లోని న్యూ వీడియో కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ ముద్రించిన బాల్యవివాహాలు – చట్టరీత్య నేరం, అత్యవసర హెల్ప్ లైన్ నంబర్లు, చైల్డ్ హెల్ప్ లైన్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం అక్టోబర్ 11న అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లాలోని వివిధ పాఠశాలల్లో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు.

దేవదాయ శాఖ భూములను పరిరక్షించాలి

దేవదాయశాఖ భూముల పరిరక్షణపై జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. దేవదాయ శాఖ భూములు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. భూములు, ఆస్తుల వివరాలను మండలాల వారీగా జాబితాలను తయారు చేయాలని ఆయన అధికారులకు చెప్పారు. సమావేశంలో జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సూర్య ప్రకాష్, సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కనక ప్రసాద్, బాపట్ల ఆర్డీఓ పి.గ్లోరియా, చీరాల ఆర్డీఓ చంద్రశేఖర్, రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి పాల్గొన్నారు.

బాల కార్మికుల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి

బాల కార్మికుల నిర్మూలనకు అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం బాల కార్మికుల నిర్మూలన జిల్లా కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలకు రాని విద్యార్థుల వివరాలను సేకరించాలని ఆయన విద్యాధికారులకు తెలిపారు. 14 సంవత్సరాల్లోపు పిల్లలు ప్రభుత్వ నిబంధనల మేరకు పాఠశాలలోనే ఉండాలని, వారు ఎక్కడా పని చేయడానికి వీల్లేదని చెప్పారు.

అసంఘటిత కార్మికుల సంక్షేమానికి చర్యలు

వివిధ రంగాల్లో పనిచేసే అసంఘటిత కార్మికుల పేర్లను ఈశ్రం పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈఎస్ఐ, ఈపీఎఫ్ సభ్యత్వం లేని వారు, ఆదాయ పన్ను పరిధిలోకి రానివారంతా అర్హులేనని కలెక్టర్ పేర్కొన్నారు.

లబ్ధిదారులకు సామాజిక భద్రతతో పాటు ఇతర సంక్షేమ పథకాలు వర్తిస్తాయని చెప్పారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసే ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో కార్మిక శాఖ సహాయ కమిషనర్ వెంకట శివప్రసాద్, వ్యవసాయ మార్కెటింగ్ మేనేజర్ రమేష్, మత్స్యశాఖ ఉప సంచాలకులు గాలి దేవుడు, వ్యవసాయ శాఖ జేడీ సుబ్రహ్మణ్యేశ్వర రావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల: జిల్లా పురోభివృద్ధికి అధికారులంతా సమన్వయంతో పని చేయాలని బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో నడుస్తున్న పథకాల అమలుపై దిశ జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. కమిటీ చైర్మన్, బాపట్ల పార్లమెంట్ సభ్యులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో 21 ప్రభుత్వ శాఖల పురోగతిపై సమీక్ష జరిపారు. పేదరిక నిర్మూలన, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పార్లమెంట్ సభ్యులు చెప్పారు. ప్రభుత్వ సేవలు ప్రజలందరికీ అందించాలని తెలిపారు. అధికారులంతా ఉన్నత ఆలోచనలు, ఆదర్శాలతో పని చేయాలని చెప్పారు. మాతృ, శిశు మరణాలను అరికట్టడంతో పాటు నిరక్షరాస్యత తొలగించాలని సూచించారు. పర్యాటక ప్రాంతంగా బాపట్ల జిల్లా మరింత అభివృద్ధి కానుందని పేర్కొన్నారు. ఒకవైపు రూ.97 కోట్లతో సూర్యలంక బీచ్, మరోవైపు రూ.88.43 కోట్లతో నిజాంపట్నంలో ఆక్వా పార్క్ నిర్మాణంతో అభివృద్ధి పట్టాలు ఎక్కనుందని వివరించారు. జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు అధికారులంతా సహకరించాలని కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ కోరారు. పథకాల అమలులో పురోగతి కనిపించాలని చెప్పారు. అధికారులంతా చక్కగా పనిచేసి రాష్ట్రంలో బాపట్ల జిల్లాను మూడో స్థానంలో నిలపాలని సూచించారు. అధికారులు సమగ్ర ప్రణాళికల రూపొందించుకొని ఆ దిశగా బాధ్యతతో విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ జి.గంగాధర్ గౌడ్, ప్రకాశం జడ్పీ సీఈవో చిరంజీవి, గుంటూరు జెడ్పీ సీఈవో జ్యోతిబసు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ విజయవంతం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జ్ మధుసూదనరెడ్డి, నాయకులు

ఇంకొల్లు(చినగంజాం): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని పావులూరు పార్టీ కార్యాలయంలో శుక్రవారం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాలు సేకరణ పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తా కోటి సంతకాల ప్రజా ఉద్యమాన్ని ముందుకు నడిపించాలని, ప్రభుత్వం స్పందించేలా భాగస్వాములు కావాలని ఆయన తెలిపారు. పేదవాడికి వైద్యసేవలను ఉచితంగా అందించే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దారుణమని, మహా ఉద్యమాన్ని ముందుకు నడిపించి విజయం సాధించాలని కోరారు. జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు, నేతలు యు. అనిల్ చౌదరి, బండి రామయ్య, అడక గంగయ్య, చందోలు ఖాదర్ బాష, అట్లూరి జయపాల్, రమేష్, దుడ్డు ప్రసన్న, రావెళ్ల అంజిబాబు, మోషే, మైలా చిన నాగేశ్వరరావు, బుజ్జి నాయక్, అహ్మద్, ములకా సుబ్బారెడ్డి, సింహాద్రి బ్రహ్మారెడ్డి, తమ్మలూరి సురేష్,అట్లూరి కృష్ణారావు పాల్గొన్నారు.

తెగిపడిన యమపాశాలు

- ఇద్దరికి గాయాలు
- తప్పిన పెను ప్రమాదం

మార్టూరు: ఏడాదిగా వలపర్ల గ్రామస్తులు భయపడుతున్నట్లే జరిగింది. గ్రామంలోని ఏ వీధి చూసినా శిథిలమైన విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న విద్యుత్ వైర్ల గురించి ఆ శాఖ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. వలపర్ల సినిమా హాల్ సెంటర్‌లో నిత్యం రద్దీగా ఉండే వైన్స్ షాప్ ఎదురుగా శుక్రవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో వేలాడుతున్న విద్యుత్ వైర్లు తెగి ఇద్దరిపై పడ్డాయి. అయితే, వారు తప్పించుకొని ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. సెంటర్‌లో అప్పటికే వైన్ షాప్ ముందు మందుబాబుల హడావుడితో పాటు హోటళ్ల ముందు ప్రజల రాకపోకలతో మెయిన్ రోడ్ అంతా హడావుడిగా మారింది. ఈ క్రమంలో చాలా కాలంగా వేలాడుతూ ఉన్న రెండు విద్యుత్ వైర్లు ఒక్కసారిగా తెగి కింద పడ్డాయి. గమనించిన స్థానికులు భయంతో పరుగులు తీశారు. గ్రామానికి చెందిన పూరిమెట్ల వెంకటేశ్వర్లు, గోలి కృష్ణ ప్రసాద్‌కు అవి తగలడంతో గాయపడ్డారు. విద్యుత్ వైర్లు తెగి పడిన క్రమంలో ఫ్యూజులు పోవటంతో ప్రసారం నిలిచిపోయింది. లైన్‌మేన్ కుమార్, సిబ్బంది తెగిపడిన విద్యుత్ వైర్లను తాత్కాలికంగా సరి చేశారు. గాయపడిన కృష్ణ ప్రసాద్‌ను స్థానిక ప్రైవేటు వైద్యుని వద్ద ప్రథమ చికిత్స చేయించి, అనంతరం మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రెండో బాధితుడు వెంకటేశ్వర్లను బంధువులు మొదట ఇంటికి తరలించగా, గుండెల వద్ద నొప్పిగా ఉందని చెప్పడంతో సాయంత్రం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. సమస్యపై పలుమార్లు విజ్ఞప్తి చేసినా అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గాయపడిన కృష్ణ ప్రసాద్, వెంకటేశ్వర్లు



వలపర్ల సెంటర్‌లో తెగిపడిన విద్యుత్ వైర్లు

మిర్చి యార్డు సమాచారం
(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	42,595
అమ్మకాలు	41,281
నిల్వ	11,715

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)	
334	10,000-15,000
నంబరు-5	10,000-14,000
273	10,500-12,500
341	10,000-15,400

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)	
334	10,500-15,200
నంబరు-5	10,000-14,200
341	10,000-15,500
4884	10,000-14,500
సూపర్-10	11,000-14,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)	
తేజ	10,000 - 15,200
బాడిగ-355	10,500 - 15,500
దేవనూరు డీలక్స్	10,000 - 14,500
ఆర్మూర్	9,800 - 12,500
తాలు కాయలు	6,000 - 7,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)	
తేజ	10,000-15,200
బాడిగ - 355	10,000-15,500
దేవనూరు డీలక్స్	10,500-14,500
తాలు	5,300 - 7,700

-కొరిటెపాడు (గుంటూరు)



పసుపు ధరలు
(శుక్రవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 259

కొమ్ములు : 175 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,460	10,560	10,560

కాయలు : 84 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,000	10,560	10,560

మొత్తం అమ్మకాలు : 194.25 క్వింటాళ్లు

యువకుడి మృతి

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదం ఓ యువకుడి ప్రాణాలు తీసింది. సత్తెనపల్లి మండలం కంటిపూడి గ్రామానికి చెందిన కారసాల ప్రమోద్ (30) యూకేలో ఉద్యోగం చేస్తున్నాడు. మూడు నెలల కిందట స్వగ్రామం కంటిపూడి వచ్చాడు. ఈ నెల 8న ద్విచక్ర వాహనంపై సత్తెనపల్లి నుంచి కంటిపూడి వెళుతుండగా, నందిగామ అడ్డరోడ్డు వద్ద బస్సును ఓవర్ టేక్ చేస్తుండగా, ఎదురుగా వస్తున్న విద్యుత్ శాఖకు చెందిన వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రమోద్‌ను తొలుత సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన జిల్లాస్థాయి వాలీబాల్ జట్ల ఎంపిక



బాలికల జట్టు

చీరాల రూరల్: స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అండర్-19 బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక ప్రక్రియ ముగిసింది. కళాశాల ప్రిన్సిపాల్ గారపాటి పుష్పరాజు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం. చింపారెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ పుష్పరాజు, కరస్పాండెంట్ శీలం విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో కూడా సత్తా చాటాలని సూచించారు. విజయం కోసం పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. వేటపాలెం బీబీహెచ్ కాలేజీ పీడీ బాపయ్య శెట్టి, పీడీ సుబ్బారెడ్డి, రిటైర్డ్ పీడీ డీసీ విద్యాసాగర్ పాల్గొన్నారు.



బాలుర జట్టు

వృద్ధురాలి మృతదేహానికి మళ్లీ పోస్టుమార్టం

క్రోసూరు: నెల రోజుల కిందట మృతి చెందిన వృద్ధురాలు చిలకా ఆరోగ్యమ్మ(96) మృతదేహానికి శుక్రవారం రీ పోస్టుమార్టం నిర్వహించారు. తహసీల్దార్ వి.వి.నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. మృతురాలు నరసరావుపేటలో నివసిస్తూ అక్కడే నెల కిందట మృతి చెందింది. అయితే ఆమెను క్రోసూరు క్రైస్తవ సమాధుల్లో పూడ్చిపెట్టటం జరిగింది. ఆమె భర్త చాలా కాలం కిందట మృతి చెందాడు. ఆమె మృతిపై అనుమానం వ్యక్తపరుస్తూ కోడలు రూతమ్మ నరసరావుపేట రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో అక్కడి ఎస్‌ఐ సీహెచ్ కిషోర్ రీ పోస్టుమార్టానికి ఏర్పాటు చేయగా తహసీల్దార్ పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో బ్రహ్మనాయుడు, సిబ్బంది, మృతురాలి బంధువులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగిని విధుల్లోకి తీసుకోవాలి

లక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపులో భాగంగా తపాలా ఉద్యమ జాతీయ నాయకుడు మహదేవయ్యను విధుల నుంచి తొలగించిందని, వెంటనే ఆయన్ను ఉద్యోగంలోకి తీసుకోవాలి ఏఐజేడీఎస్‌యూ జాతీయ నాయకులు ఎం.శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు ఎన్.వి. రాఘవేంద్రలు డిమాండ్ చేశారు. గుంటూరు బ్రాడీపేటలోని పోస్టాఫీసు వద్ద గురువారం ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ తీరుపై నిరసన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ కమలేష్ చంద్ర కమిటీ సానుకూల సిఫార్సులను అమలు చేయాలని కోరారు. గతంలో నిరవధిక సమ్మెకు నాయకత్వం వహించినందున మహదేవయ్యను ఉద్యోగం నుంచి తొలగించిన తగదన్నారు. కార్యక్రమంలో శేషిరెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి

రెంటచింతల: స్థానిక పీహెచ్‌సీ కేంద్రానికి వివిధ రకాల వ్యాధులతో వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కె.రవి సిబ్బందికి సూచించారు. స్థానిక పీహెచ్‌సీ కేంద్రాన్ని ఆయన శుక్రవారం జిల్లా మలేరియా అధికారి రత్నాకర్‌తో కలసి ఆకస్మికంగా సందర్శించారు. ల్యాబ్‌లో నిర్వహిస్తున్న పరీక్షల గురించి తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. ప్రస్తుతం జ్వరాల సీజన్ కాబట్టి ల్యాబ్ టెక్నీషియన్లు నిత్యం ఆస్పత్రిలో అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బందికి సలహాలు, సూచనలు అందిస్తూ ఉండాలని చెప్పారు. ప్రస్తుతం పీహెచ్‌సీ పరిధిలో జ్వరం కేసుల వివరాలను మెడికల్ ఆఫీసర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ పీహెచ్‌సీకి వచ్చే రోగుల వివరాలు(ఓపీ) నమోదు, ఆస్పత్రిలో రోగులకు ఆరోగ్య, ఆశా కార్యకర్తలు అందిస్తున్న సేవలు, రక్త పరీక్షల వివరాలు, మందులు ఇచ్చే విభాగం పనితీరు, వివిధ రికార్డులు పరిశీలించారు. అనంతరం రెంటచింతల గ్రామంలోని పలు ప్రాంతాలలో పర్యటించారు. ఫ్రైడే డ్రైడేను పరిశీలించారు. స్థానిక ఆరోగ్య సిబ్బందికి విష జ్వరాలపై పలు సూచనలు చేశారు. పారిశుద్ధ్య కార్యక్రమాలను మెరుగుపరచాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎన్.కోటేశ్వరరావు, మలేరియా సూపర్‌వైజర్ సీహెచ్ అంకమ్మరావు, ఎంపీహెచ్‌ఈఓ ఏడీ శర్మ, ఎ.ఆంజనేయులు, హెల్త్ అసిస్టెంట్ షేక్ ఖాసింసా, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రెంటచింతల గ్రామంలో ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్ఓ రవి

ప్రేయసిని మర్చిపోలేక వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు రూరల్: వివాహమైనప్పటికీ ప్రేయసిని మర్చిపోలేక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మండలంలోని దాసరిపాలెం కాలనీకి చెందిన చిలకా చంటి (24) స్థానికంగా ఒక యువతిని ప్రేమించాడు. పలు కారణాలతో బంధువుల కుటుంబంలోని యువతిని ఈ ఏడాది ఆగస్టులో వివాహం చేసుకున్నాడు. కొన్ని రోజులుగా ప్రేయసిని మర్చిపోలేకపోతున్నానని, ఆమె గుర్తుకొస్తోందని భార్యతో చెప్పాడు. ఈ క్రమంలో గురువారం ఇంటి పక్కన రేకుల షెడ్డులోకి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వారు పేర్కొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ వీర రాఘవయ్య

రేపల్లె: విద్యార్థి దశ నుంచే ప్రథమ చికిత్సపై అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె బ్రాంచి చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య సూచించారు. ప్రథమ చికిత్స, సీపీఆర్‌లపై పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు గుంటూరు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరరాఘవయ్య మాట్లాడుతూ ప్రమాదాల్లో గాయపడిన వారు వైద్యశాలకు వెళ్లేలోపు ప్రథమ చికిత్స వల్ల కొంత మేర వైద్యం అందుతుందని, దీనివల్ల రక్షణ లభిస్తుందని తెలిపారు. ఎవరైనా గుండెపోటుకు గురైతే వైద్యశాలకు వెళ్లే ముందు సీపీఆర్ అందిస్తే అతను బతికేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. వివిధ సందర్భాల్లో గాయపడిన వ్యక్తులకు అందించే ప్రథమ చికిత్సలు, గుండెపోటు వచ్చిన సమయంలో అందించే సీపీఆర్‌ని గుంటూరు రెడ్‌క్రాస్ సొసైటీకి చెందిన డాక్టర్ రసూల్ బృంద సభ్యులు ప్రయోగపూర్వకంగా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీసీ రవిచంద్రకుమార్, కోఆర్డినేటర్ బుజ్జిబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం కళాశాలలో ఆర్‌కే నారాయణ్ జయంతిని నిర్వహించారు. ఆయన సాహితీ సేవలను విద్యార్థులకు వివరించారు.



సీపీఆర్ విధానాన్ని వివరిస్తున్న డాక్టర్ రసూల్ బృంద సభ్యులు

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం

ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐసీడీఎస్, మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థినులకు బాలికా హక్కులు, సమాన అవకాశాలు, శక్తి వికాసంపై వ్యాస రచన, వక్తృత్వం పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మహిళా శక్తి వికాస్ సెల్ ఇన్‌చార్జ్ సుభాషిణి, సీడీపీవో సుచిత్ర, సీఆర్ఎఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ హిమబిందు, టి.రాధిక, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా హాకీ జట్టు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బాపట్ల టౌన్: మండలంలోని చెరువుజమ్ములపాలెం జిల్లా పరిషత్ హైస్కూలులో శుక్రవారం ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్- 14 బాలబాలికల హాకీ టీంను ఎంపిక చేశారు. స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎం. గోపి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని తెలిపారు. పోటీలకు బాలురు 18, బాలికలు 18 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. వీరంతా ఈనెల తిరుపతి జిల్లాలోని చంద్రగిరిలో జరిగే 69వ రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 డి. ప్రసాదరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.వి.కృష్ణారావు, ఉపాధ్యాయులు బి. గంగాధర్, ఎం. సాంబశివరావు, వాణీ సుశీల, ఏ.టి. రాంబాబు పాల్గొన్నారు.

చిన్నారుల హాజరు శాతం పెంచాలి

కర్లపాలెం: భవిత సెంటర్‌లో చిన్నారుల హాజరు శాతం పెంచాలని సహిత విద్య రాష్ట్ర పరిశీలకులు మల్లికార్జున్ చెప్పారు. కర్లపాలెం పంచాయతీ పరిధిలోని ఇందిరానగర్‌లో గల భవిత సెంటర్‌ను శుక్రవారం ఆయనతో పాటు సహిత విద్య జిల్లా సమన్వయకర్త జ్యోత్స్న తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సెంటర్‌లో చిన్నారులకు కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ చిన్నారుల సంఖ్యను 20కి పెంచాలని తెలిపారు. అడ్మిషన్‌లో ఉన్న చిన్నారులంతా భవిత సెంటర్‌కు వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శైలజ, భవిత సెంటర్ టీచర్లు ఎస్. లక్ష్మీ ప్రసన్న, సీహెచ్. చందన పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న సహిత విద్య రాష్ట్ర పరిశీలకుడు మల్లికార్జున్, సమన్వయకర్త జ్యోత్స్న

స్వయం సహాయక సంఘాలకు రూ.5.07 కోట్లు కేటాయింపు

నరసరావుపేట రూరల్: స్వయం సహాయక సంఘాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే ఉద్దేశంతో పల్నాడు జిల్లాకు రూ.5.07 కోట్లు కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ కేటాయించారని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఝాన్సీరాణి పేర్కొన్నారు. శుక్రవారం కోటప్పకొండ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సమాఖ్య సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం గ్రామనిధి అనే పోర్టల్ ప్రారంభించిందని, దీని ద్వారా జిల్లాలోని 26 మండలాలకు రూ.19.50 లక్షల చొప్పున మంజూరు చేశారన్నారు. గ్రామ సంఘాలలోని స్వయం సహాయక సంఘాల వారు అవసరం మేరకు దానిని గ్రామనిధి పోర్టల్‌లో అప్‌లోడు చేసుకోవాలని తెలియజేశారు. జిల్లా సమాఖ్య ప్రతినిధులు అందరూ కలిసి స్వయం సహాయక సంఘాలకు గ్రామ సంఘం అసిస్టెంట్‌లుగా మహిళలు మాత్రమే కొనసాగాలని జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రజని ఏకగ్రీవంగా తీర్మానించారు. గ్రామ సంఘం అసిస్టెంట్‌గా మహిళలు ఉంటే ఏవిధమైన సమాచారమైనా చెప్పకోవటానికి అభ్యంతరాలు ఉండవని జిల్లా సమాఖ్య ప్రతినిధులు, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఝాన్సీరాణి తెలియజేశారు. ఏపీడీ రాజా ప్రతాప్, డీపీఎంలు మల్లీశ్వరి, శ్రీనివాస్, డేవిడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి

రాష్ట్ర స్థాయి పోటీలకు కారంచేడు విద్యార్థులు

కారంచేడు: త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు కారంచేడు విద్యార్థులు ఎంపికయ్యారు. ఒంగోలులో ఈ నెల 7న నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలకు కారంచేడు యార్లగడ్డ నాయుడమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 60 కేజీల బాలికల విభాగంలో భవ్యశ్రీ , బాలుర విభాగంలో బి. సుదీప్‌కుమార్ ఎంపికయ్యారు. 55 కేజీల విభాగంలో కె. దుర్గ ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులను శుక్రవారం చీరాల డిప్యూటీ ఈఓ కె. గంగాధర్ అభినందించారు. త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి గ్రామానికి, పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న పాఠశాల పీడీ షేక్ మస్తాని, ప్రధానోపాధ్యాయురాలు ఎం. సామ్రాజ్యాన్ని అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న డెప్యూటీ ఈఓ, ఉపాధ్యాయులు

విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదగాలి

పెదకాకాని: విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదిగి పరిశ్రమలను స్థాపించాలని, వినూత్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు చేపట్టి విజయవంతం కావాలని పల్నాడు జిల్లా పరిశ్రమల అధికారి ఎం.నవీన్ కుమార్ సూచించారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీలోని మెకానికల్ ఇంజినీరింగ్, ఐఈఐ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రెండురోజుల జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు 'ఆమేయా -2కే25' ముగింపు వేడుకలకు శుక్రవారం ముఖ్య అతిథిగా నవీన్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాస్తవ ప్రపంచ నైపుణ్యాలను నేర్చుకోవడానికి, పరిశ్రమలకు తగ్గట్టు సన్నద్ధం అవటానికి విద్యార్థి దశ కీలకమని తెలిపారు. మొబైల్ యాప్‌లను వినియోగించడమే కాకుండా సమాజానికి ఉపయోగపడేలా వాటి తయారీపై దృష్టి సారించాలని సూచించారు. సదస్సులో జిగ్ టెక్, పేపర్ అండ్ పోస్టర్ ప్రజెంటేషన్, ఆర్‌సీ కార్నేజ్, పిక్టో, క్రిక్ క్విజ్ వంటి సాంకేతిక పోటీలలో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ రావెల నవీన్, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ టి.శ్రీనివాసరావు, సంధానకర్త వి.కిరణ్ కుమార్, ఐఈఎం విద్యార్థి విభాగ సభ్యులు ఎస్.పవన్ సాయి, సీహెచ్ విష్ణు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న నవీన్ కుమార్ తదితరులు

తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించిన నలుగురికి జైలు

బొల్లాపల్లి: అటవీ శాఖ భూములను తప్పుడు డాక్యుమెంట్లతో కాజేసిన నలుగురు వ్యక్తులకు వినుకొండ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు శిక్షతోపాటు జరిమానా విధించినట్లు బండ్లమోటు ఎస్‌ఐ ఎ.బాలకృష్ణ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.... 2013లో అప్పటి తహసీల్దార్ నిర్మలాదేవి, వీఆర్వో ఎ.వెంకటేశ్వర్లు, దార మల్లికార్జునరావు, అతని భార్య వెంకటశేషమ్మ, ముప్పాళ్ల వెంకటేశ్వర్లు కలసి మండలంలోని పేరూరుపాడు గ్రామంలోని సర్వే నంబర్ 329/3లో ఉన్న అటవీ భూములకు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి పట్టాదారు పాస్ పుస్తకాలు పుట్టించి, బ్యాంకులలో రుణాలు పొందారు. వారిపై స్టీఫెన్‌బాబు అప్పటి నరసరావుపేట ఆర్డీవో పి. అరుణబాబుకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై మన్మథరావు కేసు నమోదు చేయగా, తదుపరి వచ్చిన ఎస్‌ఐ పి. నారాయణ స్వామి విచారణ పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో సాక్షుల విచారణ అనంతరం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఆర్. ఆశీర్వాదం పాల్ తీర్పు వెలువరించారు. నిందితులపై నేరం రుజువు కావడంతో మూడు సంవత్సరాల సాధారణ జైలు శిక్షతోపాటు, రూ.1.30 లక్షల జరిమానా విధించారని ఎస్‌ఐ తెలిపారు. కోర్టు తదుపరి నరసరావుపేట ఆర్డీఓ, బొల్లాపల్లి తహసీల్దార్‌కు పట్టాదారు పాస్ పుస్తకాలు, భూమి యాజమాన్య హక్కు పత్రం లు రద్దు చేయాలని, తగు చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తి ఆర్. ఆశీర్వాదం పాల్ తీర్పులో పొందుపరచ్చారని ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.

సంపూర్ణ ఆరోగ్యానికి ఈత దోహదం

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఈతతో మెరుగైన శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతాయని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. హరినాథ్ పేర్కొన్నారు. శుక్రవారం శ్యామలానగర్‌లోని ఈత కొలనులో కానాల అంజనీ శ్రీకాంత్ రెడ్డి స్మారక 8వ మాస్టర్స్ అంతర్ జిల్లాల పోటీలు జరిగాయి. బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్యం ఏదో ఒక క్రీడలో సాధన చేయాలన్నారు. యోగా కూడా ఎంతో మేలు చేస్తుందని వెల్లడించారు. జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది రమణరావు మాట్లాడుతూ 20-90 ఏళ్ల వరకు వయస్సున్న వారికి ఈ పోటీలను ఏటా మాదిరిగానే నిర్వహించామన్నారు. 180 మంది పాల్గొన్నారన్నారు. పోటీలను ఉదయం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే గల్లా మాధవి, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావులు ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. హరినాథ్